క్లుప్తంగా

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించండి


మాట్లాడుతున్న తహసీల్దార్

బేతంచెర్ల: భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్ట్ కింద అంబాపురం గ్రామ పరిధిలోని భూముల రీ సర్వే పూర్తయిందన్నారు. మిగతా గ్రామాల్లోనూ మార్చి 10వ తేదీ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే డోన్ డివిజన్ అధికారులు సురేష్ కుమార్, చంద్రశేఖర్ వీఆర్వోలకు, సర్వేయర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీదేవి, మండల సర్వేయర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

బనగానపల్లె రూరల్: సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతాదేవి విద్యార్థులకు సూచించారు. సోమవారం కళాశాలలోని ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైజ్ఞాన ప్రదర్శనను ప్రిన్సిపాల్ పరిశీలించారు. అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని అధ్యాపకులకు సూచించారు. అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని ఉన్నతమైన భావాలు, ఆశయాలతో గొప్ప ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాధిపతి ఉమామహేశ్వర్, అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, కౌసల్యదేవి, నరేంద్రనాథ్‌రెడ్డి, నాగతిమ్మయ్య, రవికుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే విజయ డెయిరీ లక్ష్యం


పాడి రైతులకు బోనస్ నగదును అందజేస్తున్న మేనేజర్

బనగానపల్లె రూరల్: పాడి రైతుల సంక్షేమమే విజయ డెయిరీ లక్ష్యమని విజయ డెయిరీ బనగానపల్లె యూనిట్ మేనేజర్ మధుసూదన్ బాబు తెలిపారు. రామకృష్ణాపురం గ్రామంలోని విజయ డెయిరీ కేంద్రంలో పాలు పోసే 42 రైతులకు లీటర్ రెండు రూపాయల చొప్పున మంజూరైన బోనస్ మొత్తం రూ.65,698లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. అలాగే సంజామల మండలం నట్లకొత్తూరు కేంద్రంలో 15 మంది పాడి రైతులకు రూ.26,126ల నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు సుమతి, దేవ కుమారి, నర్మదమ్మ పాల్గొన్నారు.

సన్మానం


అవధాని గంగుల నాగరాజును సన్మానం చేస్తున్న దృశ్యం(ఫైల్)

బేతంచెర్ల: మూడు రోజుల క్రితం తిరుపతి జరిగిన ఆముదాల మురళీ శతావధానం కార్యక్రమంలో మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ తెలుగు అధ్యాపకుడు గంగుల నాగరాజును సన్మానించారు. నాగరాజు అవధానిగా వ్యవహరించారు. తన ప్రతిభను మెచ్చి గార్లపాటి దామోదర నాయుడు, నక్కల ప్రభాకర్ రెడ్డి, ఆముదాల మురళీ తదితరులు అభినందించారని నాగరాజు సోమవారం తెలిపారు.

పచ్చదనం పరిరక్షణకు సహకరించండి


మొక్కల సంరక్షణను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్

డోన్: పట్టణాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు మునిసిపల్ పాలకవర్గం చేపట్టిన మహా యజ్ఞానికి ప్రజలందరూ సహకరించాలని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రహరీ వెంట ఉన్న మొక్కలను సంరక్షించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గతంలో వేసిన మొక్కలకు పాదులు తీసి నీరు పోయించారు. చైర్మన్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, ఏఈ జనార్దన్ ఉన్నారు.

విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేయాలి

నంద్యాల(సిటీ): విద్యార్థులు నూతన పరిశోధనల వైపు అడుగులు వేయాలని గురురాజా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పీ దస్తగిరి రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో ఇంటర్ స్కూల్ సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ ఈఓ మహమ్మద్ బేగ్ హాజరయ్యారు.

మలుపులు...మృత్యు పిలుపులు


కస్తూర్బా ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న మలుపు


ప్రమాదంలో మృతి చెందిన యువకుడు(ఫైల్)

కొలిమిగుండ్ల: అనంతపురం-అమరావతి 544-డీ జాతీయ రహదారిపై పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాహన చోదకులు నిబంధనలు పాటించక పోవడంతో పాటు అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్న కారణంగా మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాల ఎదురుగా ఉన్న మలుపు వద్ద రెండు రోజుల క్రితం అవుకు మండలం కునుకుంట్లకు చెందిన బీటెక్ విద్యార్థిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. పాఠశాల వద్ద రోడ్డు ఎత్తుపల్లంగా ఉండటంతో పాటు ఇరువైపులా చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొలిమిగుండ్ల జమ్మలమడుగు జంక్షన్ పూర్తిగా ఇరుకుగా మారింది. మూడు రోడ్ల కూడలి మధ్యలో దాదాపు 14 ఏళ్ల క్రితం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం పనులు ప్రారంభించినా నేటికీ అసంపూర్తిగా మిగిలి పోవడంతో జంక్షన్‌లో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఏమాత్రం కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అనంతపురం-అమరావతి జాతీయ రహదారితో పాటు నెల్లూరు-ముంబై ప్రధాన రహదారి నుంచి ప్రతి రోజు వందల వాహనాలు రేయింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. స్థానికంగా నాపరాతి గనుల్లోంచి రాళ్లను తీసుకెళ్లే ట్రాక్టర్ డ్రైవర్లు ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తుంటారు. ఈ మలుపుల వద్ద గతంలో చాలా ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు అవిటి వారుగా మారి దుర్భర జీవనం సాగిస్తున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



కస్తూర్బా పాఠశాల వద్ద ఉన్న మలుపులు వద్ద ప్రయాణించాలంటే భయం వేస్తుంది. ప్రతి రోజు తోట వద్దకు ఉదయం సాయంత్రం బైక్‌పై రాకపోకలు సాగిస్తుంటాను. పెద్ద వాహనాలు వేగంగా దూసుకొస్తుంటాయి. ఎక్కడ మీదకు వస్తాయోనని భయమేస్తుంది. రోజు వందల సంఖ్యలో వాహనాలు తిరిగే రహదారి ఇది. ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం కనిపించవు. మరిన్ని ప్రమాలు జరగకముందే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
– మద్దిలేటిరెడ్డి

కంపచెట్లు తొలగించాలి



మలుపులతో పాటు రోడ్డు ఎత్తు తగ్గుగా ఉంది. పైనుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తుంటాయి. మలుపులకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిళ్ల ప్రయాణించాలంటే కష్టంగా ఉంటుంది. మలుపులకు రెండు వైపులా కంప చెట్లు తొలగిస్తే రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలు కనిపిస్తాయి.
– హుశేన్‌బాషా, కొలిమిగుండ్ల

చర్యలు తీసుకుంటాం

మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా కంప చెట్లు పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ప్యాచింగ్ పనులు చేపిస్తున్నాం. రెండు, మూడు రోజుల్లోనే కస్తూర్బా వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించి వాహనాలు కనిపించేలా క్లియర్ చేస్తాం.
– ఫణిరాం, ఏఈ, ఎన్‌హెచ్

రైతులకు అందుబాటులో ఉండాలి


రైతులతో ఈకేవైసీ వేయిస్తున్న దృశ్యం

అవుకు: మండల పరిధిలోని ఆర్బీకేల్లో వీఏఏలు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్బీకేతో పాటు శింగనపల్లె ఆర్బీకేను సందర్శించారు. ముందుగా రైతుభరోసా కేంద్రంలోని రికార్డులను, ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించి ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుకు మండలంలో ఈఏడాది రబీ సీజన్‌కు సంబంధించి 14,200 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. దాదాపు 98 శాతం రైతులు తమ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవటమే కాకుండా, 94 శాతం ఈకేవైసీని కూడా పూర్తి చేసుకున్నారన్నారు. ఇంకా మిగిలిన వారు త్వరగా ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. రబీ పంటల సాగులో సందేహాల నివృత్తి కోసం రైతులు ఆర్బీకేలకు వస్తూంటారని, వారికి అన్ని విధాలా సహాయ పడాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు.

సేవలకు సెల్యూట్


డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న అర్చకులు

డోన్ టౌన్: ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు అందుకున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఘనంగా సోమవారం అర్చక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక సాంబశివాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు కళ్లె శేషావలి శర్మ మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం నూతన తెలుగు సంవత్సర పంచాగం పుస్తకాలను డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, సీఐ శేషయ్య, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, అర్చకులు వేణుగోపాల్, చంద్రశేఖర్‌శర్మ, ప్రకాష్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, హరి, భాస్కర్‌శర్మ, శ్రీనివాసశర్మ, పుల్లయ్య, ప్రకాష్‌శర్మ, రఘుపతి, శివరామశర్మ, ఎల్‌ఐసీ అభివృద్ధి అధికారి రాజశేఖర్ ఉన్నారు.

త్యాగధనులు రేనాటి సూర్యచంద్రులు


రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, రేనాటి సూర్యచంద్రులుగా పేరు గాంచారని అంతర్జాతీయ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలుకు చెందిన లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కలియుగ దానకర్ణుడిగా పేరు గాంచిన బుడ్డా వెంగళరెడ్డికి దాతృత్వంలో ఎవరు సాటి లేరన్నారు. దాన, శౌర్య వీరులను స్మరించుకోవడం కనీస బాధ్యత అన్నారు. అనంతరం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్న కోవెలకుంట్ల కవిత్రి విజయదుర్గను సత్కరించారు. అలాగే భారత తపాలా శాఖ రూపొందించిన బుడ్డా వెంగళరెడ్డి ప్రత్యేక తపాలా కవర్లు విడుదల చేశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, కర్ణానాటి రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులపతి, రఫీ, అన్నెం శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లెలో సోమవారం తెల్లవారు జామున సంభవించిన అగ్ని ప్రమాదంలో సుభాన్ బాషాకు చెందిన గుడిసె కాలి బూడిదైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. అందరూ నిద్రిస్తుండగా తెల్లవారు జామున విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి గుడిసె దగ్ధమైందన్నారు. మాదంలో దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. కట్టుబట్టలతో మిగిలామని ఆదుకోవాలని విలపించారు. విషయం తెలుసుకున్న వీఆర్వో మల్లేశ్వరప్ప కాలిన గుడిసెను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసినట్లు తెలిపారు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణానిధిమూర్తి

బనగానపల్లె రూరల్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణానిధి మూర్తి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం సాయంత్రం బనగానపల్లె పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు బాల మద్దిలేటితో కలిసి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆ సంఘం ఉపాధాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ క్రిష్టారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంపుల్లారెడ్డి పాల్గొన్నారు.

వెన్నపూస విజయానికి..

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల సచివాయలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడి ఓటర్లను కలిసి రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు.

– కోవెలకుంట్ల: వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం సోమవారం సంజామల మండలం ముక్కమల్ల, ఆకుమల్ల, సంజామల, కానాల, ముదిగేడు, తదితర గ్రామాల్లో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు.

ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ


ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కొలువైన శివపార్వతులకు సోమవారం భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమామహేశ్వరులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సేవలకు సత్కారం


ఎంపీడీఓ, ఈఓ ఖలీల్‌కు సన్మానిస్తున్న దృశ్యం


సీఐ, ఎస్‌ఐ రామిరెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

బనగానపల్లె: పట్టణంలోని భానుముక్కలలో ఈ నెల 21, 22న జరిగిన శ్రీ పెద్దమ్మ తల్లి దేవర విజయవంతం కావడంతో భానుముక్కల రైతు సంఘం నాయకులు పలు శాఖల అధికారులను సన్మానించారు. సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ రామిరెడ్డిలను, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామయ్య, పట్టణ గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖలీల్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. దేవర విజయవంతం కావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అందరికీ అందుబాటులో వైద్యం

- పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతన భవనాలు సిద్ధం
- త్వరలోనే ప్రారంభించనున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



పాతపేటలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనం

డోన్: పట్టణీకరణ నానాటికీ పెరిగిపోతుండటంతో ఒకేచోట కేంద్రీకృతమైన వైద్యసేవలను విస్తృతపరుస్తూ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ల పేరుతో ఆసుపత్రులను ఏర్పాటుచేసింది. అయితే అద్దెభవనంలో నడుస్తున్న ఈ అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతన భవనాలను ఆధునిక హంగులతో, అత్యాధునిక వసతులతో నిర్మించింది. నియోజకవర్గంలోని బేతంచెర్ల పట్టణంలో మూడు, డోన్ పట్టణంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించారు. దీనికితోడు బేతంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలు, డోన్‌లో ఉన్న ఆసుపత్రికి వంద పడకల ఆసుపత్రులుగా ప్రభుత్వం స్థాయి పెంచింది. ఇప్పటికే కొత్తబురుజు, జలదుర్గం, ప్యాపిలి, ఆర్ఎస్ రంగాపురం, మల్కాపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సొంత భవనాల్లో పనిచేస్తున్నాయి.

పట్టణ ప్రజలకు సత్వర సేవలు..

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలకు వైద్యసేవలను విస్తృతపరిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తోంది. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్ భవనానికి రూ.80 లక్షలు కేటాయించి నూతన భవనాలను నిర్మించింది. ఈ భవనాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి త్వరలోనే ప్రారంభించనున్నారు. ఈ భవనాల్లో పది పడకల స్థాయి ఆసుపత్రిని నిర్వహించడంతో పాటు అన్నిరకాల వైద్యసేవలను రోగులకు అందించనున్నారు. 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండటమే కాక, నర్సింగ్‌తో పాటు అన్ని విభాగాల్లో సిబ్బందిని నియమించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు సుదూర ప్రాంతాలకు అవస్థలు పడుతూ వెళ్లకుండా ఈ అర్బన్ హెల్త్ సెంటర్లలోనే సుఖ ప్రసవాలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. హైరిస్క్ గర్భిణును గుర్తించి ముందుగానే వారిని జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రులకు తరలించనున్నారు. ఏ మూల చూసినా ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేవిధంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు హర్షిస్తున్నారు. రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడే లక్ష్యంతో అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రభుత్వం పట్టణాల్లో ఏర్పాటుచేయడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

విజ్ఞానాన్ని అభివృద్ధికి వినియోగించాలి

నంద్యాల(అర్బన్): కష్టపడి సంపాదించుకున్న విజ్ఞానాన్ని అభివృద్ధికి వినియోగించుకోవాలని, తోటి విద్యార్థులను వేధించడం సరికాదని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమీమ్ బేగం, జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ తెలిపారు. స్థానిక అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆత్మహత్యకు పాల్పడిన వైద్య విద్యార్థిని ప్రీతి, పాణ్యం మండలం ఆలమూరుకు చెందిన ప్రసన్న మృతికి నివాళులర్పించారు. నూర్జహాన్, బేబి, శివ, వినోద్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూములు కేటాయించాలి

బేతంచెర్ల: భూమి లేని దళిత నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ కోరారు. సోమవారం ఆయన మండల కమిటీ నాయకులు నత్తి సత్యం, మద్దిలేటి, మాధవస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాము, ఎల్లరాజు, లక్ష్మన్న, రాజు మద్దయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలోని వెంకటరమణ కాలనీలో వెలసిన అష్టలక్ష్మి కల్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలు, ప్రధాన హోమాదులు, జపాదులు, వేద పఠనములు, యంత్రాభిషేకం, మహాస్నపనము, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం రుద్రహోమం, సుదర్శనహోమం, ప్రదోషపూజ, అధివాసహోమాదులు, తీర్థప్రసాదవినియోగం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

బనగానపల్లె: బనగానపల్లె నుంచి పసుపల వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.12 కోట్ల నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ హుస్సేన్ తెలిపారు. అమరావతి హైవేకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారి ప్రియా సిమెంట్, జయజ్యోతి సిమెంట్ వాహనాలతో పాటు డోన్, గుత్తి వెళ్లే వాహనాలతో నిరంతరం రద్దీగా ఉంటుంది. దీంతో డబుల్ రోడ్డుగా మార్పుతున్నట్లు ఏఈ తెలిపారు. టెండర్ల పక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

అవుకు: రుణాలను సకాలంలో చెల్లించాలని ఉన్నతి పథకం కో ఆర్డినేటర్ శివచెన్నారాయుడు పొదుపు మహిళలకు సూచించారు. సోమవారం స్థానిక వైకేపీ కార్యాలయ భవనంలో ఏపీఎం విజయగోపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు సకాలంలో చెల్లించకపోవటంతో దాదాపు రూ.20 లక్షల బకాయి ఉందన్నారు. అలాగే వీఓఏలకు ఉన్నతి లోన్‌ల దరఖాస్తుపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి సీసీల వారిగా టార్గెట్లు ఇచ్చి రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు రవి, భీమేష్, నరసింహులు, జయమ్మ, అకౌంటెంట్ ఓబులేసు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో సోమవారం ఓ గడ్డివాము మంటల్లో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు బోయ పెద్ద మద్దయ్య పశువుల కోసం గడ్డివామును నిల్వ చేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి బమిర్భామికి వెళ్లి బీడీ తాగి పడేయడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక కేంద్ర అధికారి నరసింహులు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. దాదాపు రూ.50 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న మల్లెంపల్లె, హైవే ఫీడర్ కింద కంబాలపాడు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మార్చి 5వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లెంపల్లె ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి సాయిత్రం 5 గంటల వరకు కోత ఉంటుందన్నారు. వ్యవసాయ బోర్లకు ఉదయం తెల్లవారు జామున 3 నుంచి 12 గంటల వరకు కరెంటు సరఫరా చేస్తామన్నారు. హైవై ఫీడర్ కింద ఉన్న ప్రాంతాలల్లో మంగళవారం ఒక్క రోజు మాత్రమే ఉదయం 10 నుంచి సాయిత్రం 4 గంటల వరకు కరెంట్ కోత విధిస్తున్నట్లు చెప్పారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

డోన్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే నాడు – నేడు పనుల్లో అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పవన్ కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఆధునిక వసతులు, భవనాల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటే కొందరు ప్రధానోపాధ్యాలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పనులను తనిఖీ చేసి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల నాయకులు మారుతి, హరి, మదన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా లెగసీ వేస్ట్ శుద్ధి


తగలబడుతున్న ఘనవ్యర్థాలు

నంద్యాల(సిటీ): పట్టణంలో లెగసీవేస్ట్ పరిశుభ్రం తూతూ మంత్రంగా సాగుతోంది. సోమవారం డంప్ యార్డులో మంటలకు ఘన వ్యర్థాలు తగలబడ్డాయి, మంటలను అగ్నిమాపక శాఖ అధికారులు అదుపు చేశారు. పీవీ నగర్ ప్రాంతంలో ఉన్న డంప్ యార్డులో లెగసీ వేస్ట్‌ను శుభ్రపరిచేందుకు మున్సిపల్ నిధుల నుంచి ఏకంగా రూ.5.25 కోట్లు వెచ్చించి యంత్రాలు ఏర్పాటు చేశారు. యంత్రాలు మొరాయిస్తున్నట్లు సాక్షి దినపత్రికలో డిసెంబర్ 19న ప్రచురిస్తే అధికారులు కొత్త యంత్రాన్ని డిసెంబర్ 31న తీసుకొచ్చారు. ఆ యంత్రాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి జనవరి 13న ప్రారంభించారు. ఈ సమయంలో ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన ఘన వ్యర్థాలను శుద్ధిచేయాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఘనవ్యర్థాలు మొత్తం కాలిపోతున్నాయి. నవంబర్‌లో మొదలు పెట్టిన ఈ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఇలా కోట్ల రూపాయలు వెచ్చించినా శుద్ధీకరణలో పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.